సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 2 । జూన్ । 2023



అన్నదాతకు వెన్నుదన్ను

అన్నదాతలకు ప్రభుత్వం అండదండలు అందిస్తోంది. శుక్రవారం రైతులకు వాహనాలు అందజేయనుంది. -8లో..



హార్సిలీహిల్స్‌పై ముగిసిన లోకాయుక్త విచారణ

హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి ప్రభుత్వం విక్రయించిన భూమిపై లోకాయుక్త విచారణ పూర్తయింది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1044 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	416	430
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 355.80 కిలోలు

న్యూస్‌రీల్

3న తిరువణ్ణామలైకి బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమిని పురస్కరించుకుని 3న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మదనపల్లె-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. అల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో పుష్ బ్యాక్ , టీవీ సౌకర్యం కలదన్నారు. రానుపోను చార్జీ రూ.805 చెల్లించాలన్నారు. నాలుగు టిక్కెట్ల పైబడి బుకింగ్ ఉంటే ఇంటి వద్దకే టిక్కెట్లు తెచ్చి ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9959225677ను సంప్రదించాలని కోరారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ రాఘవరెడ్డి

రాయచోటి అర్బన్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు మరింతగా కృషిచేయాలని డైట్ ప్రిన్సిపల్, వైఎస్‌ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి కోరారు. రాయచోటిలోని డైట్‌లో జరుగుతున్న ఇండక్షన్ ట్రైనింగ్ మూడో విడత కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. ఉపాధ్యాయయులు ప్రతి ఒక్కరూ అంకితభావంతో వృత్తిధర్మాన్ని నిర్వర్తించాలంటూ కోరారు. ప్రతి విద్యార్థి ఆచరణ పూర్వక విద్యను అభ్యసించేటట్లుగా ప్రోత్సహించడం గురువుల బాధ్యత అన్నారు. శిక్షణా కార్యక్రమానికి 84 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివభాస్కర్, అసదుల్లా, నాగరాజు, కోర్సు డైరెక్టర్ నాగేశ్వరరావు, కో-ఆర్డినేటర్ వై.సి.రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న ఆచార్య కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైవీయూ దూర విద్య కేంద్ర సంచాలకులుగా భౌతిక శాస్త్ర శాఖ ఆచార్యులు కె.కృష్ణారెడ్డిని నియమిస్తూ వీసీ చింతా సుధాకర్, కుల సచివులు వైపీ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు అందచేశారు. ఇదివరకు ఈ స్థానంలో ఉన్న వృక్షశాస్త్ర శాఖ ఆచార్యులు సీఎస్ షావలిఖాన్ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి చేస్తా నని యోగివేమన విశ్వ విద్యాలయం పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రఘునాథ రెడ్డి అన్నా రు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. నూతన బాధ్యతలు స్వీకరించిన రఘునాథరెడ్డికి వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య, పూర్వపు ప్రధానాచార్యులు కృష్ణారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియ చేశారు.

ఆర్టీసీ ఈడీగా 'గిడుగు'



గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా గిడుగు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈయన విజయవాడ నుంచి కడపకు బదిలీపై రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న గోపీనాథ్‌రెడ్డిని విజయవాడజోన్ ఈడీగా బదిలీ చేశారు. అలాగే కడప జోన్ కమర్షియల్ డిప్యూటీ సీటీఎంగా పనిచేస్తున్న రమేష్‌బాబును అనంతపురానికి, అక్కడ పనిచేస్తున్న శివకుమార్‌ను కడపకు బదిలీ చేశారు. మైదుకూరు డీఎంను పులివెందులకు, పులి వెందుల డీఎంను విశాఖపట్టణం డీఎంగా బదిలీ చేశారు. కడపలో పనిచేస్తున్న ఎస్టీఐ విజయమ్మను మైదుకూరుకు, మైదుకూరులో పనిచేస్తున్న మంజులను కడపకు బదిలీ చేశారు.

రేంజర్ల బదిలీ

ముద్దనూరు: జిల్లాలో పలువురు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ముద్దనూరు ఫారెస్టు రేంజి ఆఫీసర్‌గా అశోక్‌కుమార్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న దినేష్‌కుమార్‌రెడ్డిని నంద్యాలకు బదిలీ చేశారు. అలాగే బద్వేల్ ఫారెస్టు రేంజి అధికారిగా పెనుగొండలో పనిచేస్తున్న ఉదయ్‌దీప్‌ను నియమించగా, బద్వేల్‌లో పనిచేస్తున్న మధుబాబును గుత్తికి బదిలీ చేసారు. కడప రేంజి ఫ్లెయింగ్‌స్క్వాడ్ పార్టీ అధికారిగా పలమనేరులో పనిచేస్తున్న నయూమ్ అలీని.. జమ్మలమడుగు సోషల్ ఫారెస్టు ఆఫీసర్ ప్రసాద్‌ను కడప ఎఫ్‌ఆర్వోగా, రాజంపేట సోషల్ ఫారెస్టు రేంజ్ అధికారిగా తిరుపతిలో పనిచేస్తున్న రెడ్డి ప్రసాద్‌ను నియమించినట్లు గురువారం ఉత్తర్వులు అందాయి.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి
- వరుసగా ఐదో ఏడాది రైతు భరోసా అందజేత



వైఎస్‌ఆర్ రైతు భరోసా పీఎం కిసాన్ మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రాయచోటి : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని.. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఐదో ఏడాది 2023-24 సంవత్సరం మొదటి విడతగా వైఎస్‌ఆర్ రైతు భరోసా, పీఎం కిసాన్ సాయం కింద ఒక్కొక్కరికి రూ.7500 వేలు చొప్పున నిధులు జమ చేసే కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా పత్తికొండ నుండి బటన్ నొక్కి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గురువారం రాయచోటి రూరల్ పరిధిలోని నారాయణ కల్యాణ మండపంలో తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్, సభ్యులు, జిల్లాలోని రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ.. వరుసగా ఐదో సంవత్సరం మొదటి విడతగా పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా కింద జిల్లాలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల మేర రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తరచూ చెబుతారన్నారు. రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారన్న విషయాన్ని రైతులందరూ ఆలోచించాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఇంటి ముంగిటనే అనేక రకాల సేవలు అందుతున్నాయన్నారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు రైతులు పొలం వద్దకే వచ్చి సలహాలు అందజేస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిరుధాన్యాలను సాగు చేయాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం వెంటనే ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి బాటలో పయనించాలని కలెక్టర్ పేర్కొన్నారు.
- రాష్ట్ర శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పంటసాగుకు ముందే పెట్టుబడి సాయం అందజేస్తున్న ఏకై క ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాయచోటి నియోజకవర్గంలో సంవత్సరానికి రూ.50 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.250 కోట్లు మేర రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు. ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి.. తుఫాన్లు అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆ సీజన్ ముగిసే లోగానే పరిహారం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కూడా జగనే అని అన్నారు. 9 గంటల ఉచిత విద్యుత్ కోసం ప్రత్యేక లైన్లు వేశామని చెప్పారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.50 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, రైతును అన్ని విధాలా ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని, పాడి పరిశ్రమను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.
- జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్‌ఆర్ రైతులను ఆదుకున్న విధంగానే ప్రస్తుత ముఖ్యమంత్రి రైతు సంక్షేమానికి పాటుపడుతున్నారని అభిప్రాయపడ్డారు. ఆర్బీకేల ద్వారా రైతు సేవా కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్న ఏకై క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. పంటలు నష్టపోయిన కాలంలో అధికారులు సకాలంలో నష్ట నివేదికలను ప్రభుత్వానికి అందజేయడం ద్వారా మార్చి, ఏప్రిల్, మే నెలలో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు కావడం జరిగిందన్నారు.
- సమావేశంలో ప్రభుత్వ పథకాల లబ్ధిని అందుకున్న రైతులు తమ అనుభవాలను వివరించారు. అనంతరం వరుసగా ఐదో ఏడాది 2023-24 సంవత్సరంలో మొదటి విడతగా అన్నమయ్య జిల్లాలోని 2,02,094 మంది రైతులకు రూ.151.96 కోట్ల వైఎస్‌ఆర్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక లబ్ధి చేకూరే విధంగా చర్యలు చేపట్టారు. అలాగే మార్చి, ఏప్రిల్, మే మాసాలలో కురిసిన అకాల వర్షాల వలన జిల్లాలో పంట నష్టపోయిన 1344 మంది రైతులకు రూ.1.79 కోట్ల ఆర్థికసహాయం మెగా చెక్కులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా రైతులకు అందజేశారు.
- అంతకు ముందు సమావేశ ప్రాంగణంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను వారు తిలకించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయంతో సగర్వంగా జీవిస్తున్నా



నాకున్న 3 ఎకరాల పొలంలో మునుపు కూరగాయల పంట వేశాను. ఏటా నాకు జగనన్న అందించే రైతు భరోసా అందింది. ఈ సారి వచ్చిన పెట్టుబడి సాయంతో బెండ, వంకాయ, బీర వంటి వివిధ రకాల కూరగాయల తోట సాగు చేస్తాను. ఆర్బీకే ద్వారా యాజమాన్య పద్ధతులు తెలుసుకుంటున్నాను. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో మహిళా రైతుగా సగర్వంగా జీవిస్తున్నా.

– ఎస్.శ్రీదేవి, మహిళా రైతు, నల్లగుంట్లపల్లి, రామాపురం మండలం

ఏటా పెట్టుబడి సాయం అందుతోంది



గ్రామంలో నాకు 5 ఎకరాల భూమి ఉంది. వేరుశనగ పంట సాగు చేస్తున్నాను. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి ఏడాది సంవత్సరానికి రూ.13,500 చొప్పున రైతు భరోసా క్రమం తప్పకుండా మా ఖాతాకు జమ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా మొదటి విడతగా రైతు భరోసా ఇవ్వడం ఎంతో సంతోషం. రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– ఎం.జయబ్బనాయుడు, ఆదర్శ రైతు, తలపుల గ్రామం, పీలేరు మండలం

రైతులను ఆదుకుంటున్న దేవుడు సీఎం జగన్



నాకున్న 4 ఎకరాల భూమిలో అరటి పంట సాగు చేశా. పంట చేతికి వచ్చే సమయంలో ఏప్రిల్ మాసంలో భారీ గాలులు, అకాల వర్షాల వల్ల చెట్లన్నీ పడిపోయి పంట మొత్తం నష్టపోయాను. సీఎం దయ వల్ల నాకు రూ.40 వేల ఆర్థికసాయం అందింది. గతంలో పంట నష్టపోతే ఎప్పుడు పరిహారం వస్తుందో తెలియని పరిస్థితి. రైతన్నలను ఆదుకుంటున్న మా దేవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– రవీంద్రారెడ్డి, పోలి గ్రామం, ఉద్యాన రైతు, రాజంపేట మండలం

గ్రూప్ 1 పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరగనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో ఏపీపీఎస్సీగ్రూప్ -1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. ఈనెల 3 నుండి 10 వరకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీపీఎస్సీ గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుండి 9.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ పాస్ పోర్ట్, పాన్ కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ఒకటి తమతో పాటు తీసుకెళ్లాలన్నారు. ఈ పరీక్ష జిల్లా కేంద్రమైన కడప నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు 414 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైజన్ అధికారి ఎఫ్ఎస్ఓ మల్లిఖార్జున రెడ్డి,ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

ఐసీడీఎస్‌లో బదిలీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని ఐసీడీఎస్ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్-1, గ్రేడ్-2 జూనియర్ అసిస్టెంట్లకు బదిలీలు జరిగాయి. గ్రేడ్-1 సూపర్‌వైజర్ పి.భారతిని సిద్దవటం నుంచి మైదుకూరుకు, జహరాబీని కడప రూరల్ నుంచి మైదుకూరుకు, పి.వెంకటలక్షుమ్మను సిద్దవటం నుంచి సీకే దిన్నెకు, కె.హసీనాను కడప రూరల్ నుంచి వేంపల్లెకు, వై.గుర్రమ్మను కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, ఎస్.శ్రీదేవిని కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, జి.లక్ష్మీదేవిని సిద్దవటం నుంచి బద్వేలుకు, ఎ.విజయమ్మను సిద్దవటం నుంచి బద్వేలుకు బదిలీ చేశారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్లకు సంబంధించి బి.నాగరత్నను కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, నజీర బుఖారియాను నంద్యాల రూరల్ నుంచి మైదుకూరుకు, కె.సరోజమ్మను సిద్దవటం నుంచి కడపకు, పి.లక్ష్మీదేవిని కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, శ్రీదేవిని కడప రూరల్ నుంచి మైదుకూరుకు, శ్రీవిద్యను సిద్దవటం నుంచి కడప-1కు బదిలీ చేశారు.

గృహనిర్మాణాల లక్ష్యాన్ని సాధించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: రీ సర్వే ప్రక్రియలో సర్వేరాళ్ల పాతడం , అలాగే గృహనిర్మాణాల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు.

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ పూర్తి అయిన గ్రామాలలో లక్ష్యం మేరకు హద్దురాళ్లు పాతాలన్నారు. పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. ఈ సమక్షలో డీఆర్ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

స్మార్ట్‌గా తరగతి గది

ఇప్పటి వరకూ శ్రీమంతుల బిడ్డలకే అందుబాటులో ఉన్న డిజిటల్ విద్య నేడు పేద విద్యార్థులకు కూడా అందుతోంది. సర్కార్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి రానున్నాయి. ఈ డిజిటల్ విప్లవం ద్వారా కార్పొరేట్, ప్రైవేటు సంస్థల్లో చదువుతున్న పిల్లల్లాగే.. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు కూడా ఉత్తమ విద్యా ప్రమాణాలు అందుకునే అవకాశం ఉంది.

- తొలి విడత జిల్లాలో 318 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య
- దృశ్య వీక్షణ ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు
- నాడు-నేడు ద్వారా సౌకర్యాల కల్పన
- జిల్లాకు 1180 ఐఎఫ్‌పీలు, 318 స్మార్ట్ టీవీల కేటాయింపు
- పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సౌకర్యం



మదనపల్లె సిటీ : పాఠశాలలు సాంకేతిక విప్లవాన్ని సృష్టించబోతున్నాయి. ఇన్నాళ్లు కేవలం ఉపాధ్యాయుడు చెప్పింది శ్రద్ధగా ఆలకించడం, ఆపై అభ్యసనంపైనే విద్యార్థులు దృష్టి సారిస్తూ వస్తున్నారు. అయితే ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీ పడాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మనమూ వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్న విషయం తెలిసిందే. దానిని అక్షరబద్ధం చేస్తూ విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రయోగాలే కాకుండా దృశ్య వీక్షణ ద్వారా చిన్నారుల మెదడుపై బలమైన ముద్ర పడేలా, విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా వినూత్నమైన డిజిటల్ బోధన త్వరలో ప్రారంభంకానున్న విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి తెస్తున్నారు.

తొలిదశలో 318 పాఠశాలల్లో ఏర్పాటు

జిల్లాలో తొలిదశలో 318 పాఠశాలల్లో సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నారు. బైజూస్ సేవలను వినియోగించుకుంటూ ప్రారంభమయ్యే ఈ శిక్షణ కోసం 1 నుంచి 5 తరగతుల వరకు విద్యార్థుల సౌకర్యార్థం స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తారు. 6 వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉండే పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ (ఐఎఫ్‌పీ) లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 180 ఉన్నత పాఠశాలల్లో 1180 ఐఎఫ్‌పీలు , 223 ప్రాథమిక పాఠశాలల్లో 346 స్మార్ట్ టీవీలు అందబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఇవన్నీ ఏర్పాటు చేయాలంటే ఆ తరగతి గదిలో అవసరమైన ప్రాథమిక సౌకర్యాల కల్పనపై ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి సారించింది. అంటే తరగతి గదిలో అవసరమైన ప్రాంతంలో విద్యుత్ సదుపాయం కల్పించడం తదతరాల పై సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్‌ను నాడు-నేడు ఎస్ఎంటీ యాప్‌లో పొందుపరచాలని పాఠశాలల విద్యా కమిషనర్ ఆదేశించారు.

ఉపయోగం ఇలా....

బైజూస్ టై అప్ అయి మ్యాడ్యూల్ ను విద్యార్థులకు ట్యాబ్ రూపంలో అందించినప్పటికీ తరగతిలో ఉపాధ్యాయుడి సమక్షంలో పాఠ్యాంశాలకు ఒక గొప్ప అనుభూతిని కల్పించబోతోంది. ఉపాధ్యాయులకు కూడా విద్యాబోధనలో అవసరమైన ప్రయోగాల కల్పన నేరుగా స్క్రీన్‌ని కొద్దిసేపు నిలిపి మరీ చూపించగలడం కీలక అంశం. ఇదే కాకుండా ఈ బోర్డును బ్లాక్‌బోర్డులా ఉపయోగించవచ్చు. రాసిన దానిని చెరపవచ్చు. లేదా రాసిన విషయాన్ని సేవ్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్ వినియోగించి కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకోవచ్చు. యూ ట్యూబ్, ఫోన్ లేదా టాబ్‌లోకి సమాచారం సైతం స్క్రీన్‌పై చూసేందుకు అవకాశం కలుగుతుంది.


223 ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు

బి.కొత్తకోట 5, చిన్నమండ్యం 5 , చిట్వేలి 7, గాలివీడు 15, గుర్రంకొండ 6, కె.వి.పల్లి 6, కలకడ 2, కలికిరి 9, కోడూరు 14, కురబలకోట 6, లక్కిరెడ్డిపల్లె 5, మదనపల్లె 21, ములకలచెరువు 5, నందలూరు 3, నిమ్మనపల్లె 4, ఓబులవారిపల్లె 7, పెద్దమండ్యం 7, పీటీఎం 5, పెనగలూరు 4, పీలేరు 6, పుల్లంపేట 6, రాజంపేట 13, రామాపురం 3, రామసముద్రం 4, రాయచోటి 26, సంబేపల్లి 10 , టీ.సుండుపల్లి 8, తంబళ్లపల్లె 3, వాల్మీకిపురం 2, వీరబల్లి 6 ప్రాథమిక పాఠశాలలు మొదటి ఫేస్‌లో ఎంపికయ్యాయి.

180 ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్)


బి.కొత్తకోట 6, చిన్నమండ్యం 3 , చిట్వేలి 3, గాలివీడు 5, గుర్రంకొండ 5, కె.వి.పల్లి 4, కలకడ 5, కలికిరి 6, కోడూరు 8 కురబలకోట 6, లక్కిరెడ్డిపల్లె 7, మదనపల్లె 18, ములకలచెరువు 5, నందలూరు 4, నిమ్మనపల్లె 5, ఓబులవారిపల్లె 8, పెద్దమండ్యం 5, పీటీఎం 5, పెనగలూరు 4, పీలేరు 8, పుల్లంపేట 5, రాజంపేట 8, రామాపురం 4, రామసముద్రం 6, రాయచోటి 14, సంబేపల్లి 5 , టీ.సుండుపల్లి 5, తంబళ్లపల్లె 5, వాల్మీకిపురం 5, వీరబల్లి 3 ఉన్నత పాఠశాలలు మొదటి ఫేస్‌లో ఎంపికయ్యాయి.

నాడు-నేడు ద్వారా నిధులు



నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో సాంకేతిక విప్లవం సృష్టించబోతోంది. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ఏర్పాటు ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాభ్యాసాన్ని సొంతం చేసుకునే సౌలభ్యం కలుగుతుంది. ఏం కావాలనే వివరాలను పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్ఎంటీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వీటిని పర్యవేక్షిస్తారు. – పురుషోత్తం, డీఈఓ, రాయచోటి

విద్యార్థులకు అత్యంత సౌకర్యం



సాంకేతికతను జోడించి విద్యాబోధన చేస్తుండటం ద్వారా భవిష్యత్తులో మంచి ఫలితాలు లభిస్తాయి. ఇది విద్యార్థులకు వరం. సాంకేతిక పరికరాలను వినియోగిస్తూ ఉపాధ్యాయులు కీలక భూమిక పోషించినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

– కరుణాకర్, సీఎంఓ, సమగ్రశిక్ష, రాయచోటి

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి



అబ్బవరం సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీఓ ధనలక్ష్మి

రాయచోటి అర్బన్ : సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రతిఒక్కరూ నిత్యం వందశాతం హాజరును నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, ఐసీడీఎస్ పీడీ ఎం.ధనలక్ష్మి ఆదేశించారు. గురువారం ఆమె దిగువఅబ్బవరం సచివాలయం, నక్క వాండ్లపల్లె అంగన్ వాడీ కేంద్రం, అబ్బవరం చెత్తసంపద తయారీ కేంద్రం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయం ఉద్యోగి రోజుకు మూడుసార్లు బయోమెట్రిక్ హాజరును 100శాతం నమోదు చేయాలన్నారు. సచివాలయాల ద్వారా ప్రస్తుతం అందుతున్న సేవల కంటే మరిన్ని ఎక్కువ సేవలు అందించాలంటూ సూచించారు. విద్య, సంక్షేమ కార్యదర్శులు, మహిళా పోలీస్‌లు అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ సందర్శించాలంటూ కోరారు. 6 సంవత్సరాల వయస్సులోపు గల పిల్లలకు ప్రతి ఒక్కరికీ తప్పక ఆధార్‌కార్డు నమోదు చేయించాలంటూ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అండర్‌వెయిట్‌గల పిల్లల వివరాలను తెలుసుకున్నారు. చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి వర్మికంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు.

మదనపల్లె ఫైర్ ఆఫీసర్‌గా శివప్ప



మదనపల్లె : మదనపల్లె స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా జి.శివప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న మాబూ సుబాన్ అన్నమయ్య జిల్లా రాజంపేటకు, వైఎస్సార్ కడపజిల్లా మైదుకూరులో పనిచేస్తున్న శివప్ప మదనపల్లెకు బదిలీ అయ్యారు. స్థానిక ఫైర్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఆఫీసర్ శివప్పకు ఎస్ఐ పురుషోత్తంనాయుడు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ శివప్ప మాట్లాడుతూ...మదనపల్లె అగ్నిమాపకశాఖ పరిధిలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల ప్రజలు అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే 101 లేదా 08571-222101 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. వేసవికాలంలో చెరువులు, బావుల వద్దకు ఈతకు వెళ్లే పిల్లలు, పెద్దవారు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

అన్నదాతకు వెన్నుదన్ను

నేడు రాయచోటిలో రైతులకు వాహనాల అందజేత



రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్లు

నియోజకవర్గం	సీహెచ్‌సీ గ్రూపులు	ట్రాక్టర్లు, పరికరాల విలువ (రూ. కోట్లలో)	రాయితీ (రూ. కోట్లలో)
పీలేరు	29	1.82	0.54
మదనపల్లె	27	1.89	0.66
తంబళ్లపల్లె	33	2.69	0,91
రాజంపేట	20	1.40	0.48
రాయచోటి	22	1.84	0.62
రైల్వేకోడూరు	30	1.75	0.64

సాక్షి రాయచోటి : అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండదండలు అందిస్తోంది. . ఆర్బీకేల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన శకానికి నాంది పలికిన జగన్ సర్కార్ ఒకవైపు వైఎస్సార్ రైతు భరోసా కింద ఆర్థికసాయం అందిస్తూ... సున్నావడ్డీ రుణాలు మొదలుకొని పంట ఇన్స్రూ ప్రీమియం చెల్లింపు వరకు కూడా ప్రభుత్వమే భరిస్తోంది. వ్యవసాయ విప్లవంలో రైతులకుచేదోడు వాదోడుగా నిలబడాలన్న మహోన్నత సంకల్పంతో వాహన సేవకు సిద్ధమైంది. గతేడాది కూడా వ్యవసాయానికి వివిధ కంపెనీలకుచెందిన ట్రాక్టర్లు మొదలుకొని యంత్ర పరికరాలను అందించిన ప్రభుత్వం ఈసారి కూడా సబ్సిడీతో అందించేందుకు సిద్ధమైంది.

100 ట్రాక్టర్లు.. 370 యంత్ర పరికరాలు

వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతులకు నూతన వ్యవసాయ పనిముట్లతోపాటు ట్రాక్టర్లను అందించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 400 ఆర్బీకేలు ఉండగా, గతేడాది 240 సీహెచ్‌సీ గ్రూపులకు అందజేశారు. ఈ ఏడాది 160 గ్రూపులకు సంబంధించిన రైతులు దరఖాస్తు చేసుకోగా ప్రస్తుత ప్రభుత్వం 100 ట్రాక్టర్లతోపాటు 370 యంత్ర పరికరాలను అందిస్తోంది. వీటిపై రూ. 11.39 కోట్లు ఖర్చవుతుండగా, అందులో రూ. 3.84 కోట్లు సబ్సిడీని కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. శుక్రవారం ముఖ్యమంత్రి విడుదల చేసిన అనంతరం ఎక్కడికక్కడ జిల్లాల్లో వాహనాలు, యంత్ర పరికరాలను అందించనున్నారు.

కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ సమీప ప్రాంతంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు వైఎస్సార్ యంత్ర సేవ పథకానికి సంబంధించిన వాహనాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా చేతుల మీదుగా శుక్రవారం ఉదయం సంబంధిత రైతు గ్రూపులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అన్నమయ్య జిల్లాలోని రైతులు యంత్ర సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న వాహనాల ద్వారా సేద్యపు ఖర్చులు తగ్గించుకునేందుకు అవకాశం లభిస్తుంది. జిల్లా వ్యాప్తంగా రూ. 11.39 కోట్ల విలువ యంత్రాలు, వాహనాలను అందిస్తుండగా, అందుకు సంబంధించిన సబ్సిడీని కూడా విడుదల చేయనున్నాం. గతేడాది కూడా పెద్ద ఎత్తున కొత్త జిల్లాలో ఆర్బీకే పరిధిలోని రైతు గ్రూపులకు అందించాం.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్

పాముకాటుతో అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో మహిళ అస్వస్థతకు గురైన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన వై.రమణమ్మ(65) ఇంటి పరిసరాల్లో చెత్తను శుభ్రం చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.

బస్సు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి



నూర్జహాన్ (ఫైల్)

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు అడ్డరోడ్డు వద్ద గురువారం ఆర్టీసి బస్సు నుంచి జారిపడి షేక్ నూర్జహాన్ (70) అనే వృద్ధురాలు మృతి చెందింది. బంధువుల కథనం మేరకు వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన షేక్ నూర్జహాన్ అన్నమయ్య జిల్లా ముక్కవారిపల్లిలో ఉంటున్న కుమార్తె ఇంటికి బస్సులో బయలుదేరింది. చిన్నఓరంపాడు అడ్డరోడువద్ద బస్సు దిగింది. అక్కడ నుంచి ముక్కవారిపల్లికి పల్లె వెలుగు బస్సు ఎక్కుతుండగా జారి కిందపడింది. కాలికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ముక్కావారిపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

నిద్రిస్తున్న వ్యక్తిపై కత్తితో దాడి



తీవ్రంగా గాపడిన రామకృష్ణ

పెద్దమండ్యం : ఇంటి ముందు నిద్రిస్తున్న ఓ వ్యక్తిపై అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పాపేపల్లె పంచాయతీ వెలిగింటివారిపల్లె మాదిగపల్లెలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెలిగింటివారిపల్లెకు చెందిన బాలపోగు రామకృష్ణ (65) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బెంగళూరులో ఉన్న కుమార్తెల వద్ద భార్య ఉండగా, ఇతను ఇక్కడే ఉంటూ వ్యవసాయం పనులు చేసుకుంటున్నాడు. ఇతనితో పాటు, బుద్ధిమాంద్యం ఉన్న కుమార్తెకు వైఎస్సార్ పింఛను కానుక తీసుకుంటున్నారు. ఈక్రమంలో బెంగళూరులో భార్య వద్ద ఉన్న కుమార్తెను పిలుచుకొని బుధవారం ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు మంచంపై నిద్రిస్తున్న రామకృష్ణపై కత్తితో మెడపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేయడంతో తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సల కోసం బెంగళూరుకు తరలించారు. ఘటనా స్థలాన్ని మదనపల్లె డీఎస్పీ కె కేశప్ప, ములకలచెరువు ఇన్‌చార్జి సీఐ శివాంజినేయులు, ఎస్ఐ మధు రామచంద్రుడులు పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి పరిసరాలను తనిఖీ చేశారు. కత్తితో దాడికి పాల్పడింది ఒకరేనా, లేక ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

బైక్‌లు ఢీ : వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పీఅండ్‌టీ కాలనీ వెంకటరమణారెడ్డి(63) ద్విచక్రవాహనంలో మల్లికార్జున సర్కిల్‌వైపు వస్తుండగా జిల్లా ఆస్పత్రి ఎదురుగా మరో ద్విచక్రవాహనం యూటర్న్ తీసుకోవడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో వెంకటరమణారెడ్డి గాయపడ్డాడు. అతనికి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందించారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మండలం రెడ్డికోట సమీపంలో లారీ-కారు ఢీ కొన్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మణికంఠ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు గత నెల 21న చింతామణికి కారులో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా మదనపల్లె-రాయచోటి రహదారిలో రెడ్డికోట బస్టాప్ సమీపంలో సిమెంట్ లారీ కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ రెడ్డిశేఖర్ మృతి చెందగా , తీవ్రంగా గాయపడిన మణికంఠను తిరుపతికి,పెద్దయ్యను బెంగళూరుకు రెఫర్ చేశారు. ఈ క్రమంలో గురువారం రుయాలో చికిత్స పొందుతున్న మణికంఠ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

భార్య హత్యకేసులో భర్త అరెస్టు



నిందితుడు గంగయ్యతో సీఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని సీతారామపురం దళితవాడలో మే 30న వరలక్ష్మీ అనే మహిళను హత్యచేసిన కేసులో భర్త రాజబోయిన గంగయ్యను రాజంపేట రూరల్‌పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలంలు వివరాలు విలేకరులకు వెల్లడించారు.రాజబోయిన గంగయ్య 22 సంవత్సరాల క్రితం పుల్లంపేట మండలం, దొండ్లోపల్లి దళితవాడకు చెందిన వరలక్ష్మీ అలియాస్ వరమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వరలక్ష్మీ ఎదురింటి వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పరుచుకుందన్న అనుమానంతో గంగయ్య ప్రతినిత్యం గొడవపడేవాడు. ఇదే క్రమంలో మే నెల 30వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో వరలక్ష్మి ఇంట్లో నిద్రిస్తుండగా పారతో తలపై నాలుగుసార్లు కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇంటి ముందు నిద్రిస్తున్న చిన్న కుమార్తె ఝాన్సీని గంగయ్య నిద్రలేపి మీ అమ్మను చంపాను, వెళ్లి చూసుకోమని చెప్పాడు. దీంతో ఝాన్సీ, కుమారుడు హరీష్‌లు గట్టిగా కేకలు వేశారు. ఇరుగుపొరుగువారు వచ్చేలోపు గంగయ్య పరారయ్యాడు. వరలక్ష్మీ తల్లి గద్దె లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజంపేట రూరల్ పోలీసులు కేసునమోదు చేశారు. నిందితుడు గంగయ్యను గురువారం పోలి క్రాస్ వద్ద అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన పారను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

మదనపల్లె : వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో భర్త, అత్తను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పొన్నూటిపాళ్యం పంచాయతీ భువనేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్న అనూష మే 30వ తేదీన ఆత్మహత్య చేసుకుంది. అత్తింటి వేధింపుల కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని అనూషా తల్లిదండ్రులు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో కేసు నమోదుచేసుకుని దర్యాప్తు ప్రారంభించిన సీఐ సత్యనారాయణ భర్త అశోక్, అత్త రెడ్డెమ్మను బుధవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వాహనాలు ఢీ : నలుగురికి గాయాలు



దెబ్బతిన్న వాహనం

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.. రాయచోటి వైపు నుంచి (ఏపీ16బిసి 2098)బొలెరో వాహనం వండాడి క్రాస్ వద్దకు రాగానే మదనపల్లె వైపు నుంచి వస్తున్న కారు (ఏపీ04 ఎంవై 5479) వాహన డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బొలెరెలో ప్రయాణిస్తున్న షఫీ, చంద్రాయుడు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు.వీరి వివరాలు తెలియరాలేదు. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుతో ఆవులు మృతి

గోపవరం : మండలంలోని కొత్తరేకలకుంట వద్ద గురువారం రాత్రి పిడుగు పడి 5 ఆవులు మృతిచెందాయి. అదే గ్రామానికి చెందిన కటారిగురయ్యకు చెందిన మూడు ఆవులు, అడుసువారిపల్లెకు చెందిన మూరంరెడ్డిసుబ్బారెడ్డికి చెందిన రెండు ఆవులు మృతిచెందాయి. రోజు మాదిరే పొలంలో మేతకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు రావడం, దానికి తోడు పిడుగు పడటంతో ఆవులు మృతిచెందాయి. చనిపోయిన 5 ఆవుల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

రైలుదోపిడీ ఘటనలో అనుమానితుల విచారణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల కమలాపురం సమీపంలో జరిగిన రైలు దోపిడీ సంఘటనపై పోలీసులు పలుకోణాల్లో దర్యాప్తుచేపట్టారు. దోపిడీ దొంగల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను రేణిగుంట నుంచి కడపకు తీసుకు వచ్చి విచారిస్తున్నట్లు సమాచారం. దొంగతనానికి సంబంధించి వారి ప్రమేయంపై ఆరా తీస్తున్నట్లు తెలియవచ్చింది.

కువైట్‌లో చిట్వేలివాసి మృతి



మౌలాఖాన్ (ఫైల్)

కడప కార్పొరేషన్ : జీవనోపాధి కోసం దేశం కాని దేశానికి వచ్చి గుండెపోటుతో మరణించిన వ్యక్తిపట్ల ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సభ్యులు, మృతుడి స్నేహితులు ఔదార్యం చూపారు. తలోచేయి వేసి అతని మృతదేహాన్ని స్వదేశానికి పంపారు. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం, నక్కలపల్లికి చెందిన పఠాన్ మౌలాఖాన్(43) జీవనోపాధి నిమిత్తం డ్రైవర్‌గా పని చేసేందుకు పదేళ్ల కిందట కువైట్ వెళ్లాడు. మౌలా భార్య కూడా కువైట్‌లోనే ఉండేది. మూడు నెలల క్రితమే డెలివరీ కోసం ఇండియాకు వచ్చింది. ఈ నేపథ్యంలో గతనెల 14వ తేదీ మౌలాకు గుండెపోటు రావడంతో అతని స్నేహితులు ఆసుపత్రిలో చేర్పించి, ఈ విషయాన్ని భార్యకు చేరవేశారు. భర్త పరిస్థితి విషమంగా ఉందని తెలిసి, సిజేరియన్ అయినా కూడా లెక్క చేయక 12 రోజుల పాపను ఇంటివద్దనే వదిలేసి మే 25వ తేదీ తిరిగి కువైట్ వచ్చింది. అయితే దురదృష్టం కొద్దీ 28న మౌలా మృతి చెందాడు. పదేళ్లు పనిచేసినా మౌలా మిగిల్చుకున్నదేమీ లేదని, పైగా ఇద్దరు ఆడపిల్లలే అని తెలియడంతో ఏపీఎన్‌ఆర్ టీఎస్ సభ్యులు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. కువైట్‌లో ఇమ్మిగ్రేషన్ పనులన్నీ వైఎస్సార్‌సీపీ వెల్ఫేర్ ఇన్‌చార్జి గోవిందు నాగరాజు, మౌలా స్నేహితులు పూర్తి చేశారు. బాడీ బాక్స్, టికెట్, దారి ఖర్చులకు 370 దినార్లు(రూ.98918) ఖర్చు కాగా, అందులో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సభ్యులు రూ.53వేలు, రూ.45వేలు మౌలా స్నేహితులు భరించారు. చెన్నై నుంచి రాయచోటి వరకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ వారు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. మౌలా భార్యకు టికెట్ డబ్బులు వారి బంధువులే భరించారు. ఈ సందర్భంగా మౌలా మిత్రులు సుధాకర్‌రాజు, శ్రీనివాసరాజు, సుబ్రమణ్యం రాజు, సుదర్శన్‌రాజు, ఎం. రమేష్‌లు మట్లాడుతూ ఏపీఎన్‌ఆర్ టీఎస్ సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

కాపాడిన రైల్వే పోలీసులు



వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులతో రైల్వే సీఐలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ వద్ద తండ్రితో పాటు ఇద్దరు బిడ్డలు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించారు.ఈ ఘటన గురువారం జరిగింది. ట్రాక్‌పై పడుకున్న వీరిని రైల్వే కానిస్టేబుల్ గమనించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.వివరాలిలా ఉన్నాయి. కడపలోని మృత్యుంజయకుంటకు చెందిన వెంకటసుబ్బయ్య ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి భార్య ఉదయగిరి నాగలక్ష్మితోపాటు కుమార్తె సుదీక్ష (4), భువనేశ్వర్ (ఒకటిన్నర సంవత్సరం) ఉన్నారు. అయితే కుటుంబంలో చోటుచేసుకున్న కలహాలతో జీవితంపై విరక్తి చెందిన వెంకట సుబ్బయ్య తన ఇద్దరు బిడ్డలను తీసుకుని కడప రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. గూడ్స్ వద్ద రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ పోలీసులు వారిని గమనించి ఆ ప్రాంతానికి చేరుకున్నారు.తండ్రీ బిడ్డలను రైల్వే పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం నాగలక్ష్మిని పిలిపించి వారి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే సీఐలు శ్రీనివాసులు, నాగార్జునలు మాట్లాడుతూ క్షణికావేశంతో నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు.

హార్సిలీహిల్స్‌పై ముగిసిన లోకాయుక్త విచారణ



విచారణ జరుపుతున్న గంగరాజు (ఫైల్)

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉన్న హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి ప్రభుత్వం విక్రయించిన భూమిపై లోకాయుక్త విచారణ పూర్తయింది. గత ఏడాది లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించి విచారణ అధికారిగా లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ (దర్యాప్తు విభాగం) గంగరాజును నియమించారు. సొసైటీ భూముల వ్యవహారంపై సుదీర్ఘంగా, లోతుగా దర్యాప్తు చేపట్టి పూర్తిస్థాయిలో నివేదికను లోకాయుక్త ఐజీ నరసింహారెడ్డికి సమర్పించారు. ఈ నివేదికపై తదుపరి చర్యలు ప్రారంభం కానున్నాయి. 1974లో ప్రభుత్వం సొసైటీకి 20.60 ఎకరాలను మార్కెట్ విలువకు విక్రయించింది. ఈ భూమిలో సభ్యులకు ప్లాట్ల కేటాయింపు వ్యవహారంపై అక్రమాలు, అవకతవకలు జరిగాయి. కొందరు తమకు ప్లాట్లు కేటాయించి స్థలాలు చూపలేదని లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లారు. చనిపోయిన ద్వారకనాథరెడ్డి అనే వ్యక్తి సొసైటీ భూముల వ్యవహారంపై ఫిర్యాదు చేయడంతో లోకాయుక్త విచారణకు ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి చనిపోవడంతో అయన కుమారుడు వెంకటరామిరెడ్డి కేసులో చేరారు. దీనిపై విచారణ అధికారి గంగరాజు క్షేత్రస్థాయిలో పరిశీలనలు, దర్యాప్తు చేశారు. లోతైన విచారణ కోసం రెవెన్యూ, సహకార అధికారుల సహకారం తీసుకున్నారు. విచారణలో వెలుగుచూసిన విషయాలతో నివేదికను లోకాయుక్త ఐజీ నరసింహారెడ్డికి అందించారు. దీనిని ఆయన పరిశీలించి అనుమానాలపై విచారణ అధికారి నుంచి వివరణలు కోరే అవకాశం ఉంది. దీనిపై సంతృప్తి వ్యకమయ్యాక ఐజీ లోకాయుక్త డైరెక్టర్‌కు నివేదికను పంపిస్తారు. ఆయన పరిశీలన పూర్తయ్యాక లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మరెడ్డికి నివేదిస్తారు. ఈ నివేదిక ఆధారంగా లోకాయుక్త ఎలాంటి చర్యలు, ఆదేశాలు జారీ చేస్తారో వేచిచూడాలి.